# ప్రజలను కలిసి.. భరోసా కల్పించి..

'ఏమ్మా బాగున్నావా.. అన్నా ఆరోగ్యం ఎలా ఉంది.. చిన్నా ఏం చదువుతున్నావు..' చిరునవ్వుతో అందర్నీ పలకరిస్తూ ముందుకు సాగడం.. మన జగన్ ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను మీకు అందించింది. ఏమైనా రాకపోతే చెప్పండంటూ అడగడం.. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవడం.. పేదల ఆర్థిక కష్టాలు ఆరా తీసి ట్రస్ట్ ద్వారా సాయం చేయడం.. ఇలా సాగుతోంది కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం. దీనికి నేటితో ఏడాది పూర్తయింది.

- కోవూరు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం
- ప్రారంభించి నేటితో ఏడాది
- 89,794 ఇళ్ల సందర్శన
- ట్రస్ట్ ద్వారా విస్తృతంగా ఆర్థిక సాయం


జొన్నవాడలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి (ఫైల్)

**బుచ్చిరెడ్డిపాళెం:** గడప గడపకు మన ప్రభుత్వం.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కొడవలూరు మండలాల్లో ఈ కార్యక్రమం నిర్విరామంగా జరుగుతోంది. గతేడాది ఆగస్ట్ ఒకటో తేదీన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది కాలంలో ఎమ్మెల్యే మండలాల్లో పర్యటించి సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబం ఎంతమేర లబ్ధి పొందిందో వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**ప్రతి ఇంటికీ వెళ్లి..**

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 1,07,000 గృహాలున్నాయి. ఇప్పటి వరకు ప్రసన్నకుమార్‌రెడ్డి 89,794 ఇళ్లను పూర్తి చేశారు. మిగిలిన వాటిని నెలరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆరా తీసి సచివాలయ నిధులతో పరిష్కరించడం జరిగింది. గడప గడపకు కార్యక్రమం ఇప్పటికే విడవలూరు, కొడవలూరు మండలాల్లో పూర్తవగా.. ఇంకా బుచ్చిరెడ్డిపాళెం టౌన్, కోవూరు టౌన్‌లతోపాటు ఇందుకూరుపేట మండలంలోని మైపాడు గ్రామం మిగిలి ఉంది.

**చికిత్స చేయించుకుంటూ..**

వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని గత సంవత్సరం మే నెలలోనే ప్రారంభించాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే ప్రసన్న ఎడమకాలు సహకరించలేదు. అయినా ఆయన వెనకడుగు వేయలేదు. చికిత్స చేయించుకుంటూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**సాయం చేస్తూ..**

గడప, గపడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మండలాల్లో పర్యటించే సమయంలో తల్లిదండ్రుల్లేని పిల్లలు, విద్యకు దూరమైన వారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, అనాథలైన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులను చూసి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చలించిపోయేవారు. తన తండ్రి పేరు మీద ఉన్న నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా అడిగిన వారికి లేదనకుండా ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారి పేర్ల మీద ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించారు.

### ఆత్మసంతృప్తి పొందుతున్నా

గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 89 వేల ఇళ్లను సందర్శించాను. ప్రతి ఇంట్లో నన్ను ఆప్యాయంగా చూసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఆనందంగా ఉన్నారు. దీనిని కళ్లారా చూశాను. తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్య మంత్రిని చేసేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారు. చాలామంది పేదలకు మా ట్రస్ట్ ద్వారా ఆర్థికంగా అండగా నిలవడం ఆత్మసంతృప్తిని అందించింది.

– నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే


దివ్యాంగురాలైన అరగల పల్లవికి ఆర్థిక సాయం చేస్తున్న ప్రసన్న (ఫైల్)

# రైతులకు పట్టాలు అందజేస్తాం


నేదురుమల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**పొదలకూరు:** 'రైతులకు పట్టాలు అందజేసి తీరుతాం. ఈ కార్యక్రమాన్ని ఎవరూ అడ్డుకోలేరు.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బత్తులపల్లి, నేదురుమల్లి గ్రామాల్లో రూ.1.14 కోట్లతో నిర్మించిన ఆర్బీకే, సచివాలయ భవనం, సిమెంట్ రోడ్లను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు భూములు పంపిణీ చేస్తామంటే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి కడుపు మండిపోతోందని విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి కంటే తాను తక్కువ అభివృద్ధి చేసినట్లు నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ చేయబోనని సవాల్ విసిరారు. పేదల భూములను ఆక్రమించి రాజకీయాలు చేయాల్సినంత దుర్గతి తనకు పట్టలేదన్నారు. సోమిరెడ్డి ఏదో ఒక విధంగా తనపై ఆరోపణలు చేసి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పదిహేనేళ్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. రైతులు అనుభవిస్తున్న భూములకు పట్టాలు అందజేసి భరోసా కల్పిస్తామన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశంలో ఏ ఇతర రాష్ట్రంలోనూ లేదన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల హామీలను అమలు చేసేందుకు పటిష్టమైన వలంటీర్ల వ్యవస్థ లేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సీఎం హామీలను అమలు చేస్తున్నారని, ప్రతి పంచాయతీలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం తదితర మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు.

**500 బోర్ల మంజూరు**

సర్వేపల్లి నియోజకవర్గంలో చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా 500 బోర్లు మంజూరు చేయించినట్లు మంత్రి కాకాణి తెలిపారు. బోర్లు వేయించడంతోపాటు, మోటార్లను కూడా బిగిస్తారని చెప్పారు. ఆరు డ్రిల్లింగ్ యంత్రాల ద్వారా వేగంగా బోర్లు వేయిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా డ్రిప్ ఇరిగేషన్‌కు 50 శాతం మాత్రమే రాయితీ ఉండేదని, తాను మంత్రి అయిన తర్వాత 70 శాతం సబ్సిడీని అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.980 కోట్లను తాము చెల్లించినట్లు గుర్తుచేశారు. తాను కంపెనీలతో మాట్లాడి రూ.2,070 కోట్లతో డ్రిప్ ఇరిగేషన్‌ను రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, వ్యవసాయ అధికారులు సుబ్బారెడ్డి, సుధాకర్‌రాజు, ఏపీఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ టి.పెంచలనాయుడు, సర్పంచ్‌లు ఉడతా రమేష్, పద్మమ్మ, మండల సచివాలయ కన్వీనర్లు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎం.వెంకటశేషయ్య, నాయకులు డి.వెంకటరమణారెడ్డి, ఆర్.గోపాల్‌రెడ్డి, సీహెచ్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎస్సీ రైతులకు విత్తనాల పంపిణీ


విత్తనాలు అందుకున్న రైతులతో మంత్రి కాకాణి

**నెల్లూరు(వీఆర్సీసెంటర్) :** జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం పలురకాల విత్తనాలను పంపిణీ చేశారు. నగరంలోని పొదలకూరు రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా షెడ్యూల్డ్ కులాల రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ప్రతి రైతుకు రూ.10 వేలు విలువ చేసే విత్తనాలను అందిస్తున్నట్లు తెలియజేశారు. మొత్తం 1,102 మంది రైతులకు రూ.1,10,20,000ల విలువైన విత్తనాలను అందజేస్తామని, త్వరలో మండల కేంద్రాల్లో 42 వ్యవసాయ పరికరాలను అందజేస్తామన్నారు. ప్రస్తుతం జొన్నలు, రాగులు, కొర్రలు, మినుములు, పెసలు, కందులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, పిల్లిపెసర లాంటి విత్తనాలతోపాటు కిచెన్ గార్డెన్ విత్తనాలైన సొరకాయ, ఉల్లిపాయ, పొట్లకాయ, మిరప, వంకాయ, ముల్లంగి, బెండకాయ, బీన్స్, మెంతికూర, పాలకూర విత్తనాలను అందజేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ పీడీ రమేష్, ఈఓ సెల్వీ పాల్గొన్నారు.

### జగనన్న కాలనీల్లో వసతులు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ

**సంగం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించినట్లు సంగం గృహ నిర్మాణ శాఖ ఏఈ కరిముల్లా అన్నారు. సోమవారం సంగం తిరుమనతిప్ప వద్ద జగనన్న ఇళ్ల కాలనీలను ఆయన పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు జరిగేలా చూస్తున్నామన్నారు. ఈ కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తయితే మినీ విలేజ్‌గా తయారవుతుందన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

### వైభవంగా గంగమ్మ జాతర


గంగమ్మకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

**నెల్లూరు రూరల్ :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్ పడారుపల్లిలో ఉన్న గంగమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టోత్సవాల సందర్భంగా మండల పూజలు (48 రోజులు) పూర్తయిన సందర్భంగా జాతర జరిపించారు. ఇందులో భాగంగా మహిళలు గ్రామం నుంచి భక్తిశ్రద్ధలతో బోనాలను గంగమ్మ ఆలయం వరకు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. దేవతాలంకరణలో నృత్యాలు చేస్తూ తప్పెట్లు, బాణసంచా మధ్య కొమ్ము వాయిద్యాలు, వీరతాళ్లతో గంగమ్మ పెట్టెను ఊరేగించారు. ఆలయంలో అమ్మవారితో పాటు పోతురాజు స్వామికి ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ చేశారు. సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్లు పెట్టుకుని నైవేద్యాలు సమర్పించారు. పలుప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గంగమ్మ సేవకుడు కాకుటూరు శ్రీహరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, నాయకులు సుబ్బారావు, పుల్లారెడ్డి, శేషయ్య, శివయ్య, పుల్లయ్య, మురళి, మస్తాన్‌రెడ్డి స్థానిక పెద్దలు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న మహిళ

# వరి, మొక్కజొన్న పంటల పరిశీలన


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

**బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు, దామరమడుగులోని వరి, మొక్కజొన్న పంటలను సోమవారం ఆత్మ డీపీడీ శివనారాయణ, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన శీనయ్య కేఎన్ఎం-733 అనే నూతన వరి వంగడాన్ని సాగు చేస్తున్నట్లు తెలిపారు. అయితే పంట దిగుబడి సమయంలో ధాన్యం గింజల్లో నల్ల మచ్చలు వస్తున్నట్లు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. కంకి పొట్ట నుంచి బయటకు వచ్చే సమయంలో కురిసిన వర్షాలతోపాటు అధికంగా గాలి వీయడంతో గింజలు పాలు పోసుకోలేదన్నారు. దీంతో తాలు గింజలుగా మారడంతోపాటు అక్కడక్కడ నల్లమచ్చలు వచ్చాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నల్లమచ్చలు పోయేందుకు ఒక ఎకరానికి ప్రొఫినోఫాస్ 400 మి.లీ, ప్రొపికొనాజోల్ 200 మి.లీ కలిపి పిచికారీ చేయాలని కోరారు. అలాగే దామరమడుగులో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను కూడా పరిశీలించి యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో బ్రీడర్ శ్రీలక్ష్మి, శాస్త్రవేత్త పరమశివ, డి.విజయకుమార్ నాయక్, ఏఓ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం బాగుందా?


భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- ఆరా తీసిన ఎంఈఓ

**కొడవలూరు:** మధ్యాహ్న భోజనం ఎలా ఉందంటూ ఎంఈఓ జి.వసంత కుమారి ఆరా తీశారు. మండల కేంద్రమైన కొడవలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# లారీని తప్పించబోయి.. అదుపుతప్పి..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు
- నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై వీరప్రతాప్

**బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని సాల్మన్‌పురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీస్‌ల కథనం మేరకు.. కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన మాలకొండయ్య, శ్రీనివాసులు నెల్లూరు వైపు నుంచి బుచ్చిరెడ్డిపాళేనికి మోటార్‌బైక్‌పై బయలుదేరారు. సాల్మన్‌పురం వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. దీంతో మాలకొండయ్యకు కుడికాలు, శ్రీనివాసులుకు కుడికాలు విరిగింది. సమాచారం అందుకున్న ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# కార్మికులకు దుస్తుల పంపిణీ



**బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు జొన్నవాడ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఆయన సతీమణి 13వ వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ సోమవారం పట్టణంలోని తమ నివాసం వద్ద దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం శ్రమించే కార్మికులకు, నగర పంచాయతీ సిబ్బందికి దుస్తులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పుట్టా ప్రదీప్ పాల్గొన్నారు.

### మంత్రి కాకాణి పరామర్శ

**పొదలకూరు:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు పట్టణంలో సోమవారం పలువురిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న ఆర్యవైశ్య ప్రముఖుడు అనిశెట్టి సుబ్బారావు మృతిచెందారు. మారుతీనగర్‌కు చెందిన రమేష్‌స్వామికి మాతృవియోగం కలిగింది. వారి కుటుంబాలను మంత్రి పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రి వెంట బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

### 3న వేలం

**మనుబోలు:** మనుబోలు పంచాయతీ పరిధిలోని పశువుల సంతకు ఈనెల 3వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీతో గడువు ముగుస్తుండడంతో తిరిగి వేలం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు వేలం జరుగుతుందని, ఆసక్తి గల వారు రూ.10 వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### బీమా సొమ్ము అందజేత



**బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని రేబాల గ్రామానికి చెందిన కంటా వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా.. అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయం కింద రూ.10 వేలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు పేరు మీద వైఎస్సార్ బీమా నమోదైందన్నారు. ఆయన భార్య ప్రభావతికి నగదు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మస్తానయ్య, హరిప్రసాద్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

### కామాక్షితాయి సేవలో..


ఆలయం వద్ద బ్యాంక్ అధికారులు

**బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆడిట్ డిపార్ట్‌మెంట్ ఛీఫ్ మేనేజర్ ద్వారక సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణపతిస్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, బ్యాంక్ అధికారులు సమిక్ దత్తా, కృష్ణకుమార్, కేవీ సుబ్బారావు, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

# విజ్ఞాన వెలుగులు

**ఆ గ్రంథాలయం 70 సంవత్సరాలకు పైగా విజ్ఞానాన్ని పంచింది. ఈ పుస్తక భాండాగారాన్ని ఒక దాత నెలకొల్పారు. ఒకప్పుడు పాఠకుల పెద్ద సంఖ్యలో వచ్చేవారు. కాలం మారడంతో సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. నేడు భవనం శిథిలమవడంతో గ్రంథాలయాన్ని మూసివేశారు.**

- 1950లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన దాత
- భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మూసివేత


పొట్టెంపాడులో గ్రంథాలయం


**ముత్తుకూరు:** మండలంలోని పొట్టెంపాడులో అరుదైన గ్రంథాలయం ఉంది. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఇక్కడ 1950 సంవత్సరం జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం రోజున 'సర్వోదయ గ్రంథాలయం'ను ఏర్పాటు చేశారు. స్వరాజ్యం సిద్ధించిన కొత్తల్లో నిలువెల్లా దేశ భక్తి, స్వాతంత్య్ర స్ఫూర్తి కలిగిన 'మోపూరు సుందరరామిరెడ్డి' అనే దాత దీనిని నెలకొల్పారు. పొట్టెంపాడు గ్రామమంటే వరి సేద్యానికి, ధాన్యం దిగుబడులకు పెట్టింది పేరు. వ్యవసాయంలో ఆరితేరిన రైతుల్లో పత్రికా పఠనం, పుస్తకాభిలాష కలిగించాడాయన. లైబ్రరీలోని చెక్క బీరువాల్లో మహాభారతం 18 పర్వాలు, మహాభాగవతం, రామాయణం తదితరాలు, భరత ఖండాన్ని పాలించిన చక్రవర్తులు, రాజుల చరిత్ర, దేశ భక్తులు, వీరమాతల సాహస కథలు మొదలుకుని మరెన్నో కావ్యాలు, నాటకాలు, నాటికలు, నవలలు, పంచతంత్రం తదితర నీతి కథల వరకు సుమారు 4,000 పుస్తకాలున్నాయి.


బీరువాలో పుస్తక సంపద (ఫైల్)

**నాటి వైభవం నేడు అదృశ్యం**

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు రాజ్యమేలుతున్నాయి. దీంతో పుస్తక ప్రియులు, సాహిత్యాభిమానుల సంఖ్య నానాటికి తగ్గిపోయింది. ప్రజల్లో పఠనాశక్తి క్రమంగా అదృశ్యమైపోతోంది. దీంతోపాటు గ్రంథాలయ భవనం కూడా శిథిలమవడం మొదలైంది. దాతల విరాళాల ద్వారా వచ్చే వడ్డీతో ఇక్కడ బీపీఎంగా పనిచేసే రమణయ్య రిటైరయ్యారు. ఇదే క్రమంలో పాఠకులు రావడం తగ్గిపోయింది. నిర్వహణ భారమవడంతో ఇటీవల ఈ గ్రంథాలయం మూతపడింది.

**కంప్యూటర్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు**



ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మూతపడిన గ్రంథాలయం స్థానంలో కంప్యూటర్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉంది. శిథిల భవనాన్ని తొలగించి, నూతన భవనం నిర్మించాల్సి ఉంది. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం.

– పల్లంరెడ్డి జనార్దనరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, పొట్టెంపాడు

# ట్యాబ్‌లను వినియోగించండి

- డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసన్న

**మనుబోలు:** ప్రభుత్వం అందజేసిన బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించాలని డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం ఆమె విచ్చేసి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశ్నలడిగి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. కొందరు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను తీసుకురాలేదని ఆమె గుర్తించారు. తప్పనిసరిగా ట్యాబ్‌లను వెంట తెచ్చుకుని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్, యూనిఫాం, బూట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆమె వెంట పాఠశాల హెచ్‌ఎం డేవిడ్, టీచర్లున్నారు.

# కసుమూరులో పర్యాటకుల సందడి


దర్గా వీధిలో పర్యాటకులు

**వెంకటాచలం:** పర్యాటకులతో మండలంలోని కసుమూరు దర్గా సందడిగా మారింది. నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు విచ్చేస్తున్న వారు కసుమూరుకు కూడా వస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేశారు. పోలీసులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయించారు.

**ఎస్పీ ప్రార్థనలు**

కసుమూరు దర్గాకు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి విచ్చేశారు. ఆయనకు ముజావర్లు ఘన స్వాగతం పలికారు.


ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ప్రార్థనలు